

# జనస్థానం

**మహారాణి** సుమిత్రాదేవి అంతఃపురంలో చేటీ జనాధ్యక్షురాలు వసుంధర చాల సంభ్రమంతో మహారాణి సన్నిధానానికి వెళ్ళుతున్నది. ఆమె నడకలోని సంభ్రమం పరిచారికా వర్గాన్ని హడలుగొడుతున్నది. వసుంధర, మహారాణిని సమీపించింది.

సుమిత్రాదేవి వ్యాఘ్రచర్మంచే కప్పబడిన పెద్ద ఆసనంపై కూర్చొని ఉంది. తెల్లని వస్త్రాలను ధరించి, ఆమె వేదిగతాగ్నిజ్వాలవలె పవిత్ర భీకరంగా కన్పిస్తున్నది!

"వసుంధరా! ఏం విశేషం?" అని ప్రశ్న.

"మహారాణీ! చాలా రహస్యమైన విషయాన్ని తమతో మనవి చేయడానికి వచ్చాను."

సుమిత్రాదేవి చుట్టుప్రక్కల ఉన్న పరిచారికావర్గాన్ని సాభిప్రాయంగా చూచింది. అందరూ ఆ చోటు విడిచి జారుకొన్నారు. అంతఃపురం గోడలకు చెవులుంటాయన్న సత్యం వసుంధర వంటి అనుభవజ్ఞులకు తెలియని విషయం కాదు. ఆమె మహారాణికి దగ్గరగా వెళ్ళి, శ్వాస తగలనీయకుండా హస్తతలాన్ని అడ్డంగా పెట్టుకొని, మహారాణి చెవిలో గుసగుసలాడింది.

"హా! ఎప్పటినుంచి?" అని అడిగింది సుమిత్రాదేవి. ఆ ధ్వనిలో ఆందోళన, భయం, శోకం మిళితమై ఉన్నాయి.

"ఈరోజే తెలిసింది."

"మరెవరికైనా ఈ విషయం తెలుసా?"

"బ్రహ్మకి కూడ తెలియదు, మహారాణీ!"

"వసుంధరా! నేను భగవాన్ వసిష్ఠులవారిని రహస్యంగా చూడాలి."

"చిత్తం, మహారాణీ! నేనే రహస్యంగా వెళ్ళి తీసుకొని వస్తాను."

• • •

ఆనాడు మధ్యాహ్నం మైత్రావరుణి వసిష్ఠ మహర్షి సుమిత్రా సదనానికి వెళ్ళారు. సుమిత్రాదేవి గురు సన్నిధానంలో వసుంధర చెప్పిన రహస్య వృత్తాంతాన్ని చెప్పింది. వసిష్ఠ మహర్షి సావధానంగా అంతా విన్నారు.

"రాజమాతా! ఇలాంటి సందర్భాల్లో మనం కఠినమైన రాజనీతిని అవలంబించాలి. వసుంధర, నీవు, నేను — ఈ ముగ్గురికి తక్క ఈ విషయం ఎవరికినీ తెలియకూడదు. ఇదంతా సుఖాంతంగానే పరిణమిస్తుందని నా అంతరాత్మ చెబుతున్నది. ఈ సాయంకాలమే ఒక ప్రకటన చేయించాలి. ప్రకటన ఈవిధంగా ఉండాలి: 'యువరాణి ఊర్మిళ దీర్ఘమైన యోగనిద్రలో ఉంది. కాబట్టి లక్ష్మణావతి సౌధం దగ్గర ఎట్టి శబ్దమూ ఎవరును చేయరాదు. చేటీ జనాధ్యక్షురాలు వసుంధర తక్క మరెవరును సౌధంలోనికి వెళ్ళకూడదు. అలా వెళ్ళడానికి ప్రయత్నించినవారు కఠినంగా శిక్షింపబడుతారు. ఇదే శ్రీరామ పాదుకా ప్రతినిధి యువరాజ శత్రుఘ్నుని రాజశాసనం' అని."

"మహాత్మా! మీరు చెప్పినట్లే చేస్తాను. కాని శత్రుఘ్న కుమారుని ...." అని మాటమధ్య ఆపేసింది, సుమిత్రాదేవి.

"రాజమాతా! ఆ పనిని నేను నెరవేరుస్తాను."

భగవాన్ వసిష్ఠ మహర్షి వెళ్ళిపోయారు. మర్నాడు ప్రొద్దున్నే రాజశాసనం ప్రకటింపబడింది.

• • •

"లక్ష్మణా! ఇదో, చూడు, గౌతమి గమన విన్యాసం ఎంత మనోహరంగా కన్పడుతున్నదో! ఒక చోట ఎగిరి గంతులు వేస్తున్నది. వేరొకచోట స్థాయీభావాన్ని పొందిన గానప్రవాహంవలె గంభీరంగా నడుస్తున్నది. ఇక్కడ చూడు. తాళగతులను ఆవాహన చేసుకొన్న మహానర్తకివలె మళ్ళ తిరిగి భీకర ఘట్టనలతో రాళ్ళపై నుండి దొర్లుతున్నది! ఈ ప్రాంతంలోనే చదునైన స్థలంచూచి మనం ఆశ్రమనిర్మాణం చేసుకొంటే బాగుంటుంది. ఏం, సీతా, నీ వేమంటావు?"

సీతాదేవి కోదండపాణి కోదండాన్ని నల్లని ఆకు పసరుతో బాగా రుద్ది మెరుగుదిద్దుతూ, తన మనోహరుని చూచి, "ప్రాణనాథా! మీ కంటికి ఏది ఇంపుగా ఉంటుందో అది నాకంటికి శతాధిక మాధుర్యాన్ని చేకూర్చేదిగా ఉంటుంది. ఈ ప్రాంతం ఎంతో రమణీయంగా ఉంది!" అని అన్నది.

లక్ష్మణుడు గండ్రగొడ్డలిని చే ధరించి భూమిని చదును చేయడానికి పూనుకొన్నాడు. ఇంతలో మధురాతిమధురమైన వేణునాదం

వాయు మండలంలో అలలను లేపుతూ వారి కర్ణ కుహరాల్లో ప్రవహించింది. ఎంతో కమ్మగా ఉంది ఆ నాదం!

"చూచావా, సీతా! విధాత అద్భుత సృష్టి. సామాన్యమైన వేణు దండంలో ఎంత తీయని నాదం ఉబుకుతుందో! అదే వేణుదండం మంత్ర పూతమైనప్పుడు నిప్పులు క్రక్కుతుంది. ప్రళయాన్ని కూడ రేపుతుంది" అని అంటూ లక్ష్మణునివైపు తిరిగి, శ్రీరాముడు "లక్ష్మణా! వెళ్లి ఆ గానం ఎవరి వాయుపూరితంలోంచి నిర్గమిస్తోందో చూచుకొని రా. ఆ బండరాతి మీద మేమిద్దరం నీ రాకను ఎదురు చూస్తూ కూర్చుంటాం" అన్నాడు.

లక్ష్మణుడు మితభాషి. వానికి వదినె, అన్న—వీరిద్దరూ దైవస్వరూపులు. వారి ఆజ్ఞ వానికి శిరసా ధార్యం. వెంటనే శబ్దం వస్తున్న దిక్కును అనుసరించి వెళ్లడానికి తయారయ్యాడు.

"లక్ష్మణా! ఈ గోదావరికి అవతల ప్రదేశమంతా జనస్థాన రాజ్యానికి సంబంధించినది.

## 'వాసిష్ఠ'

రాక్షసరాజు ఖరుడు దాన్ని కఠినంగా పాలిస్తున్నట్లు ఇచ్చట ఋషిగణం చెప్పిన మాటను మరచిపోవద్దు. ఈ శబ్దం ఒకవేళ రాక్షస మాయగా ఉండనూ వచ్చు" అన్నాడు రాముడు.

"అన్నయ్యా! మీ తమ్ముని భుజబలాన్ని శంకిస్తున్నారా?" వాని వృషభాక్షముల్లో ఎరుపు జీర మెరసింది.

శ్రీరాముడు మందహాసం చేశాడు. సీతాదేవి ఓరకంటితో సాక్షేపంగా భర్తవైపు చూచింది.

"సౌమిత్రీ, కాదయ్యా. వట్టిచేతులతో వెళ్తుంటే చెప్పాను. ఆయుధధారివై వెళ్లవోయ్!"

లక్ష్మణుడు రామాజ్ఞను శిరసావహించి వెళ్లాడు.

• • •

ఒక వన్నెల యువతి గుబురుగా పెరిగిన అశోక వృక్షం క్రింద రాతిపై కూర్చొని ఉంది.

కర్తవ్య నిర్వహణానికి మించిన ఉత్తమ ధర్మమేమీ లేదు. సాఫల్యం సిద్ధించితే జీవితం తరిస్తుంది. సతీపతులలో ఒకరు ఆ విధంగా కట్టుబడినప్పుడు రెండవవారి కర్తవ్యం ఏమిటి?



ఆమె వేణువును పూరిస్తున్నది. ఆమె మైకట్టు, అవయవాల్లో పొంగి పొరలుతూన్న లావణ్యఝరి— ఇవి ఆ యువతి వయస్సును కప్పి ఉంచుతున్నాయి. ఆమె స్తనమిథునం చక్రవాక మిథునం వలె అన్యోన్యం బుజ్జగించుకొంటూ, వీపున ముడివేయబడిన నల్లని ఉత్తరీయంచే బాగా బిగింపబడి ఉంది. కుచ్చెళ్ళుపోసి కట్టుకొన్న నల్లని వస్త్రం ఆమె కటిప్రదేశం నుంచి విరివిగా వ్రేలాడుతున్నది. నల్లని ఉత్తరీయాన్ని వల్లెవాటుగా వేసుకొని ఉంది ఆమె. ఆమె కండ్లు నల్లకలువ మొగ్గల్లాగు సొగదేరి చూడ సొంపుగా ఉన్నాయి. ఆమె ముక్కు కండ్లను భజిస్తున్న సంపంగి పువ్వువలె కన్పిస్తున్నది. ఆమె నుదుటిపై ఎర్రని సిందూర తిలకం రాణిస్తున్నది. ఆమె భుజదండాలు సౌకుమార్యాన్ని ఒలకపోస్తున్నా, అంతస్సారం కలవై కన్పడుతున్నాయి.

లక్ష్మణుడు ఆమెను చూచాడు. 'లోకమాత కాళీదేవిగాని కాదుగదా!' అని సందేహించాడు. "మాతా! నీవు ఎవరవు?" అనే ప్రశ్న ఆ యువతి వాదోపాసనను కలంచింది.

ఆమె లేచి నిలబడింది. ఆమె మంచి ఎత్తరి. మెళ్ళో ఒంటిపేట ముత్యాలసరం ఆమె నల్లని శరీరంపై జిగ జిగ మెరుస్తున్నది. మెళ్ళో నల్లపూసల కుత్తిగంటు కన్పించకపోయినా, దాని లోని బంగారు తళతళమని మెరుస్తున్నది. ఆమె ముంజేతి శంఖవలయాల్లోని చిరుమువ్వలు గల్లు గల్లుమని మ్రోగుతున్నాయి.

ఆమె లక్ష్మణుని చూచి ముఖం దించేసుకొంది. క్రిందికి వంగి బండరాతిపై సుద్ద ముక్కతో —"నా పేరు నీలి" అని వ్రాసింది.

లక్ష్మణుడు నవ్వాడు. "బాగు. విజ్ఞులు నీలిమాకాశాన్నే 'అదితి' అని చెబుతారు. దాన్నే 'దేవమాత' అనికూడ పేర్కొన్నారు. నా కంటికి ఓ నీలీ — నీవు దేవమాత అదితివిగా కన్పిస్తున్నావు!" అని చెప్పాడు తృప్తిగా ఆమెనే చూస్తూ.

నీలి బండరాతిపై కొన్ని పంక్తుల్ని వ్రాసింది. "నేనేమీ అంత గొప్పదాన్ని కాను. పచ్చి రక్తమాంసాలతో కూడిన మానవిని. నన్ను మీరు గౌరవించ నక్కరలేదు. నేనొక విషాద స్త్రీని. మీ చరణదాసిని."

'చరణదాసిని' అన్న మాటని విని సౌమిత్రి కంపించాడు. క్రోధంతో వాని ముఖం గైరిక ధాతువువలె ప్రకాశించింది. "నీలీ! ఆ పదాన్ని ఉపసంహరించుకో. నేను వివాహితుణ్ణి!"

నీలి నవ్వింది. వ్రాసినవాటిని చెరిపి తిరుగ ఇలా వ్రాసింది: "ప్రభూ! మీకెందుకు కోపం. ఆ పదాన్ని తుడిచేశాను లెండి. నేనూ వివాహిత స్త్రీనే! కాబట్టి నా మాటలో చెడు ఉద్దేశం లేదు."

"నీలీ! సంతోషించాను. నీవు ఒంటరిగా ఇక్కడికి ఎందుకొచ్చావు? ఏమి, నీవు మాట్లాడ లేవా?"

# జనస్థానం

నీలి మరల ఇలా వ్రాసింది: "ప్రభూ! నేను మూగదాన్ని. అయినా కొద్దిపాటి చదువుకొన్నాను. నా అన్న ఇక్కడికి యాభై యోజనాల దూరంలో ఉన్నాడు. అంటే పంపాసరోవరం దగ్గరన్నమాట. భగవత్స్వరూపులైన మీ సేవ చేయాలని నాకు బుద్ధి పుట్టింది. నా అన్న దానికి సమ్మతించాడు. నేను మీ నివాసంకొరకు ఇక్కడికి శతపథ దూరంలో ఆశ్రమ నిర్మాణం చేశాను. మీరు దాన్ని పావనం చేయాలని నా ప్రార్థన."

"నీ భర్త ఒప్పుకొన్నాడా?"

నీలి నిశ్శబ్దమైన నిండు నవ్వును ప్రదర్శించింది. ఆమె కండ్లు మిలమిలమని మెరిసిపోయాయి. 'భర్తంటే స్త్రీకి అపూర్వమైన వస్తువ కాబోలు. భర్తపేరు వినగానే ఈ నల్లని పిల్ల ఎంత చక్కగా నవ్వింది! కండ్లలో ఎంత ఆనందం తాండవించింది!' అని లోలోపలనే తలంచాడు సౌమిత్రి.


నీలి మరల వ్రాసింది — "నా భర్త విరాగి. మునివృత్తిలో ఉన్నారు. నేను మూగదాన్ని కాదా?" నీలి కండ్లు చెమర్చాయి.

అనుతాపంచే సౌమిత్రి ముఖం వాడింది. "నీలీ! నీ భర్త చర్య సమర్థనీయం కాజాలదు. నీవు మూగదానవైనా, నీ సౌందర్యంలో మాధుర్యం ఉంది."

నీలి సిగ్గుదొంతర్లచే పులకరించింది!

• • •

సీతారాములు క్రొత్తగా నీలిచే నిర్మింపబడిన ఆశ్రమంలో కాపురం పెట్టారు. గోదావరి నది ప్రక్కనే ఎత్తయిన చదును జాగాలో ఆశ్రమం నిర్మింపబడింది. ఆశ్రమం చుట్టూ వెదురుదడి వేయబడి ఉంది. ఆ దడిని పెనవేసుకొని రకరకాల పుష్పలత లున్నాయి. ఆశ్రమం నల్ల సాన రాతి పలకలచే కట్టబడి ఉన్నది. నేలకూడ నల్ల సానరాతి పలకలచే నున్నగా గచ్చువలె నిగనిగలాడుతున్నది.



సమావేశం

చిత్రం—ప్రేమ్‌చంద్ర గోస్వామి (జయపూర్)

ఆశ్రమ ముఖద్వారం దగ్గర పెద్ద మంచె కట్టబడి ఉంది. ఆ మంచె బలమైన సాల వృక్షాల మొదళ్లచే చాల పటిష్ఠంగా కట్టబడింది. మంచెపైన విశాలమైన గది ఉంది. గదికి నాలుగు వైపులా కిటికీలు ఉన్నాయి. వెదురు గోడలు వివిధ చర్మాస్తరణాలై శీత వాతాతపాలకు తట్టుకోగలవిగా ఉన్నాయి. మంచెపై ఎక్కి వెళ్ళడానికి చెక్కలచే అమర్చబడ్డ సోపానాలున్నాయి.

అది లక్ష్మణుని నివాస స్థలం. అది సైనిక పర్యవేక్షణ కనువుగా ఉంది. ఈ ఆశ్రమాన్ని నిర్మించిన మహాశిల్పి — విషాద స్త్రీ నీలి.

సీతాదేవి తమ ఆశ్రమాన్ని చూచి చాలా ఆనందించి, "నాథా! మన అంతఃపుర నందనవనం కేవలం కృత్రిమసౌందర్యం కలది. ఇప్పటి నందనవనంలో ప్రకృతి సౌందర్యం ఎంత గొప్పగా ఉందో చూడండి. నా చెల్లెలు ఊర్మిళ సౌందర్యోపాసకురాలు. ఆమెగాని ఈ శోభని చూస్తే ఎంత మురిసిపోయేదో గదా! మరిదిని చూచినప్పుడంతా నాకు జాలి వేస్తుంది సుమండీ! పాపం, జత విడిచిన పక్షిలాగున్నాడు!" అని పలికింది.

"ప్రియే! వానప్రస్థాశ్రమ నియమాలను పాటించవలసిన మాకు జతపక్షి ఉన్నా లేకున్నా ఒకటేగదా!" అన్నాడు రఘువీరుడు.

"వానప్రస్థాశ్రమ నియమం పాటించవలసిన నిర్బంధం మీకుగాని, మా మరిదికి లేదే! అతడు కావాలంటే ఊర్మిళను తెచ్చుకొని ఈ మనోహర ప్రాంతంలో కేళీ వినోదాల్ని అనుభవింపవచ్చును కదా!" అని నవ్వింది సీతాదేవి.

మల్లిపొదల మధ్య ఉన్న జలయంత్రాన్ని పరీక్షిస్తూన్న సౌమిత్రి ఈ మాటను విని గతుక్కుమన్నాడు.

"ఓయ్! తమ్ముడూ! ఇలా రా. నీ వదినె ఏమంటుందో విన్నావా? నీవు ఊర్మిళను తెచ్చుకోడంలో మాకేం ఆక్షేపణ లేదోయ్!"

అన్నా తమ్ముళ్ల సంభాషణకు మందహాసం ముఖమంతా ఆవరింపగా నీలి అరుగు వారగా నిలబడి వింటున్నది. లక్ష్మణుని ముఖం వాడిన పద్మంలాగైపోయింది. ఆ ధీరుని కంటివెంట కన్నీటిబొట్లు నేలబడి చితికాయి. తన్ను తాను సమాధానం చేసుకొని కన్నీటిని కొనగోటితో ఎగజిమ్మి, నవ్వుతూ అన్నగారిని చూచి ఇలాగన్నాడు:

"వదినెగారితో చెప్పండి, అన్నయ్యా! సుఖదుఃఖాలు రెండింటిలోను సౌమిత్రికి అన్నగారితో సమవాటా ఉంది. అదిన్నీకాక, సౌమిత్రికి ధనుస్సు వంచడం, దానిని కోటికి ఎక్కించడం, వర్షకాలపు వానజల్లువలె బాణాలను చిమ్మడం ఇత్యాది వీరోచిత క్రియల్లోనే వేర్పు ఉందే కాని, ప్రియురాలితో కలిసి వినోద కేళిని సల్పడం

అలవాటు లేదు."

శ్రీరాముడు తన ప్రియురాల్ని చూచి నవ్వాడు.

"మరిదీ! ఆ విషయంలో నీవేమంత శ్రమ పొందనక్కరలేదు. మా ఊర్మిళ ఆ విద్యని పూర్ణంగా నేర్పగలదు."

సౌమిత్రి తల వంచుకొని, "తల్లీ! రాళ్లని చెక్కడంలో సిద్ధహస్తురాలైన మీ చెల్లెలు, భర్తని కూడ తరిణ పట్టగలదన్న సత్యం మీ నోటంట నా కిప్పుడే తెలిసింది. దానికి నేను మీకు కృతజ్ఞుణ్ణి" అన్నాడు.

సీతాదేవి ఉల్లాసంగా నవ్వింది. నీలి కూడ దొంగచాటుగా నవ్వుకుంది.

"లక్ష్మణా! మా పర్ణశాలకంటె నీ శిబిరం మాతన ఫక్కీలో కట్టబడింది. ఇంతకీ ఈ పట కుటీర నిర్మాత నీలీదేవికి మనం ధన్యవాదాల్ని సమర్పించాలి" అని చెప్పి నీలివంక చూచాడు పురుషోత్తముడు శ్రీరాముడు.

నీలి ముఖం నీలోత్పలంలాగు మెరిసింది. ఆమె శ్రీరాముని పాదాలకు వంగి నమస్కరించి, రాతిముక్కతో రాతిబల్లపై వ్రాసింది: "ప్రభూ! శరణు కోరుతున్నాను."

రాఘవుని భుజాలు పొంగిపోయాయి. అతడు శరణన్నవారికి పెన్నిధివంటివాడు కదా!

"భద్రే! చెప్పు. నేను నీకు శరణు ప్రసాదించాను. ఏం కావాలో నిర్భయంగా చెప్పు. అది దేవదానవ సాధ్యమైనదైనా ఈ దాశరథి ఆచరించి తీరుతాడు!" అన్నాడు గంభీరంగా.

నీలి రాతిపలకపై వ్రాసింది: "ప్రభూ! నన్ను మీరు మీ ఆశ్రమ పరిచారికమగా స్వీకరించండి."

శ్రీరాముడు తటపటాయించి సీత వంక చూచాడు. "నీలీ! నీ సేవను ప్రభువులు అంగీకరించారు" అని నమస్కారపరిష్కారం చేసింది సీత.

అదిమొదలు నీలి ఆశ్రమ కార్యకలాపంలో సర్వాధికారిణిగా ప్రవేశించింది!

• • •

కొన్ని మాసాలు సీతారాములు ఆశ్రమవాసం నిశ్చింతగా గడిపారు.

ఒక రోజు రాత్రి లక్ష్మణుడు తన గదిలో పచారు చేస్తున్నాడు. వాని చేతిలో నారి ఎక్కుపెట్టిన ధనుస్సు ఉంది. గుడ్డి వెన్నెల దీనంగా ప్రసరించి ఉంది. ఆశ్రమానికి కొన్ని గజాల దూరంలో నది ఒడ్డున ఎవరో ఏదో పనిని తదేకదీక్షగా చేస్తున్నట్లు పసిగట్టాడు, సౌమిత్రి. సౌమిత్రి వింట బాణాన్ని సంధించాడు. తీక్ష్ణంగా చూచాడు. చటుక్కుమని విల్లును క్రిందికి దించేశాడు. కారణం? నీలి ఆకృతి ఆ వెన్నెట్లో వానికి కన్పించింది.

'ఈ నల్లపిల్ల ఏం చేస్తూందో?' అని సందేహించి గుడ్డి వెన్నెట్లో చకచకమని తిరుగాడుతున్న నీలిని తదేకదీక్షతో చూడసాగాడు.

ప్రకృతిలో, హృదయాహ్లాదకర వస్తువుల్లో సుందరయువతి అగ్రస్థానం వహిస్తుంది. ప్రకృతినే స్త్రీగా వర్ణించి, తృప్తిని పొందక కవులు దానిలోని ఒక్కొక్క వస్తువునూ స్త్రీల అవయవాలతో పోల్చి వర్ణిస్తారు. ముగ్ధత్వం, ప్రౌఢత్వం అనే జంట పదాలు ప్రకృతిలోని ప్రతి వస్తువుకూ సామాన్యమై ఒప్పుతుంటాయి. రెండింటిలోను ప్రత్యేకత ఉంటుంది. అనుభవించే వ్యక్తి సర్వశక్తులనూ పూర్తిగా తన వశం చేసుకొంటుంది ప్రౌఢావస్థను పొందిన వస్తువు.

నీలి ప్రౌఢావస్థను పొందిన పూర్ణ సుందర వస్తువు. అర్ధనగ్న శరీరంతో నిరాటంకంగా నది ఒడ్డున సంచరిస్తున్న చక్కని, చిక్కని నల్లని చుక్క — నీలి! ఆమె అవయవాల వంపుసొంపులు ధీరయువకుల హృదయంలో ధారాళంగా ప్రవేశించి తియ్యని స్పందాన్ని పుట్టించ తగినవై ఉన్నాయి. మహాధీరుడైన లక్ష్మణుని హృదయాకాశంలో తటిత్తులాగు ఒక విపరీత భావం మెరిసింది. నియమ కంచుకంతో బ్రహ్మచర్య దీక్షను పాటిస్తున్న ఆ ధర్మవీరుని హృదయంలో ఆ భావం చప్పజారిపోయింది. ఆరిపోయిన కొరకంచు ధూమాన్ని కొంతకాలం క్రక్కుతుంది. అలాగే లక్ష్మణుని ముఖంలో లజ్జాధూమం త్రుటికాలం తాండవించింది.

రాత్రిలో చాలభాగం గడిచింది. చంద్రుడస్తమించాడు. చీకట్లు ఆవరించాయి. నీలి ఆ చీకటిలో కలిసిపోయి, సౌమిత్రికి కన్పించలేదు. మంచె క్రింద అడుగుల చప్పుడు.

"ఎవరది?" అన్నాడు సౌమిత్రి. సన్నని మధురమైన వేణునాదం వినిపించింది.

"నీలీ! ఇలా, రా!" అని పిలిచాడు, సౌమిత్రి. ఆ ధ్వనిలో ఆజ్ఞ స్ఫురించింది.

నీలి సోపానాలను ఎక్కి, సౌమిత్రికి ఎదురుగా వచ్చి నిలబడింది.

"నీలీ! నది ఒడ్డున ఏం చేస్తున్నావు?" అని ప్రశ్న.

"ఆశ్రమ క్షేమాన్ని అనుసరించి ఆ విషయం చాలా గోప్యం—ప్రభూ!" అని వ్రాసి చూపింది నీలి.

సౌమిత్రి ముఖం కోపంతో ఎర్రతామరవలె భాసించింది. "నీలీ! సఖితో కలిసిన ప్రణయంలో తప్ప రహస్యగోపనం ఇక్ష్వాకుల యువక రక్తంలో లేదు! రాజనీతిలో కూడ భగవంతుడైన శ్రీరామునికి రహస్యం ఉండదు. యుద్ధనీతిలో బొత్తిగా లేదు."

నీలికి ఈ మాటలలో కొంత అత్యుక్తి గోచరించింది. కాని, ఆమె మూగది. ఆ విషయంలో ఆ మహావీరునితో వాదించడానికి శక్తి ఉన్నా మౌనం వహించి, ఇలాగు వ్రాసింది:

"ప్రభూ! క్షమించండి. శూర్పణఖ ముక్కు చెవులను మీరు కోసి పంపారు కదా! ఆ రాక్షసి తన సోదరుడైన ఖరునితో మొరపెట్టుకుంది. ఖరుడు తన సోదరులైన దూషణ త్రిశిరస్సులతో ఆలోచించి మన ఆశ్రమాన్ని ముట్టడించాలని మూడు రోజుల క్రిందట తీర్మానించాడు. కాబట్టి ఆశ్రమ సంరక్షణ నిమిత్తం కొన్ని యాంత్రిక క్రియలను చేస్తున్నాను. వెదురు గొట్టాల్లో విషవాయువులను లేపే ద్రవ్యాలను నింపి నది ఒడ్డంట చిక్కగా నాటి ఉంచాను. జానకి త్రాడు మూలంగా అగ్నిని ఉద్దీపనచేసిన కొన్ని క్షణాల్లో భయంకర ధూమం శత్రుసైన్యాన్ని చీకాకు పరుస్తుంది! ఈ పనిని నేను వారం రోజులుగా రాత్రుళ్ళు చేస్తూ, ఈ రోజు సాంతం చేయగలిగాను."



విషాదం
శిల్పం—గిడుతూరి లక్ష్మీనారాయణ
(బొంబాయి-19)

లక్ష్మణుడు నీలి వ్రాసిన పంక్తుల్నిచూచి తనలో మునిగిపోయాడు. వాని స్మృతిపథంలో— తానూ, అన్నా భగవాన్ విశ్వామిత్ర మహర్షితో కలిసి వెళ్లడం, తాటకవధ, యాగరక్షణ, మిథిలాపురిలో తమ సోదరుల వివాహం జ్ఞప్తికి వచ్చాయి. అయోధ్యలో తన ప్రాణసఖి ఊర్మిళతో కలిసి సంచరించిన రోజులు కండ్లముందర గోచరించాయి—సౌమిత్రికి.

ఊర్మిళ! చంద్రోర్మిల మేళనం! ధావళ్య యుతమైన శరీరప్రభకు తగ్గ అంగసౌష్ఠవం, ఆ సౌష్ఠవానికి తగ్గ సౌకుమార్యం, ఆ సౌకుమార్యంలోనూ పటుత్వం, ఆ శిల్పకళా వైశద్యం, తపోనుగ్రహ మిళితమైన కళోత్కృష్టత, లలితమైన కళామతల్లికి తగ్గ శాస్త్ర పాండిత్యం, మూలికా ప్రభావ జ్ఞానంతోపాటు అనుభవ జ్ఞానం, సౌందర్య శాస్త్ర విజ్ఞాన మేళనరాశి — తన ప్రాణాధిక శయనసఖి — ఊర్మిళ మనోహర విగ్రహం, సౌమిత్రి హృదయఫలకంలో జాగృత మయింది.

సౌమిత్రి కండ్లు చెమ్మగిల్లాయి. ఆ చెమ్మ తెరగుండా ఒకమారు నీలిని చూచాడు. "నీలీ! అన్నగారు ఇలాంటి యుద్ధనీతికి విరోధులు."

నీలి మందహాసం చేసి, మరల వ్రాసింది: "ప్రభూ! నాకా విషయం అజ్ఞాతం కాదు. అయినా, సాహసించాను. కారణం వినండి. ఖరుడు సామాన్యుడు కాడు. మహామాయావి.

# జనస్థానం

వాని మూలబలం పధ్నాలుగువేల సంఖ్య కలది. ఒక్కొక్కరూ ఆరితేరిన యోధులు. కృత్రిమ యుద్ధంలో ఆరితేరిన మహావీరుడు — ఖరుడు!"

లక్ష్మణుడు కొన్నిక్షణాలు ఆలోచించాడు. నీలి సహేతుక తర్కం వానికి నచ్చింది. "నీలీ! నీ బుద్ధివిశేషానికి మెచ్చుకొన్నాను. సరే. నీవు వెళ్ళు. తెల్లవారుతూంది."

నీలి వెళ్లిపోయింది!

• • •

శ్రీరాముడు భీకరంగా సింహంలాగు పచారు చేస్తున్నాడు. లక్ష్మణుడు చేతులు కట్టుకొని నిలబడి ఉన్నాడు. సీతాదేవి భర్తముఖాన్నిచూస్తూ కూర్చొని ఉంది. నీలి, సీతాదేవి దగ్గరగా నిలబడి ఉంది.



రతీ మన్మథులు

ఫోటో—ఎమ్. పి. చౌదరి (విశాఖపట్టణం-2)

శ్రీరాముడు నీలివైపు తిరిగాడు. "నీలీ! జనస్థాన విజయం నీదికాని, మాది కాదు. నీవు వ్రాసి, బాణానికి కట్టి, నాముందర విసరిన పత్రఖండం నాకు అందింది. నేనింకా కర్తవ్యాన్ని నిర్ణయించక ముందే ఖరాసురుని సైన్యం సమీపించడం, నీవే వ్యాప్తమైన ధూమంలో పడి సైనికులు చెల్లాచెదురై ఒకరికొకరు కొట్టుకొని మరణించడం జరిగింది. ధూమంతో సమంగా గాంధర్వ మాయని ఎలా పంపావా అని నేనిప్పుడు కూడ ఆశ్చర్యాన్ని పొందుతున్నాను.

"నీలీ! ఇట్టి అధర్మయుద్ధాన్ని మేం హర్షించ జాలం! నీవు స్త్రీవి. అదీన్నీకాక నా అభయాన్ని పొంది ఉన్నావు. కాబట్టి, ఇన్నాళ్లూ నీవు మాకు చేసిన పరిచర్యని ఉద్దేశించి, నిన్ను క్షమించాను. ఇకమీద నీవు మా ఆశ్రమంలో ఉండ వీలులేదు. రేపటిదినం సాయంకాలం లోపుగా నీవు ఈ స్థలం విడిచి వెళ్ళిపోవలసిందే.

"నీలీ! నీవు మాకెట్టి సమాధానం చెప్ప నక్కరలేదు."

నీలి ముఖం దించుకొంది. ఆమె కనుకొలంకుల నుంచి కన్నీటి బిందువులు నేలమీద వ్రాలి చితికి పోతున్నాయి. సీతాదేవి జాలిగా నీలిని చూచింది. నీలిపక్షాన భర్తతో వాదించడానికి ఆమెకు ధైర్యం చాలదు. ఆమె కండ్లుకూడ చెమర్చాయి.

లక్ష్మణుడు నిశ్చలంగా నిలబడే ఉన్నాడు. అన్నగారి వైపు చూచి ఇలాగన్నాడు: "అన్నా! నీలి చేసిన అపరాధంలో నాకూ కొంత బాధ్యత ఉంది" అని చెప్పి తలను దించుకొన్నాడు. సీతాదేవి తన తలపై పిడుగు పడినట్లే భావించి కంపించింది. నీలి గజగజ వణికిపోతున్నది.

పచారు చేస్తున్న శ్రీరాముడు ఆగిపోయాడు. "నా చెవులేనా, సౌమిత్రీ, ఈ మాటల్ని వింటున్నాయి? పిరికిమందు నీకెవరు పోశారోయ్? మహావీరుడవు, భగవాన్ విశ్వామిత్ర మహర్షి శిష్యుడవు. నీవేనా ఈ అన్యాయ యుద్ధనీతికి తోడ్పడింది? నీ చేతిలోని ధనుస్సుని, నీ ఒరలోని కత్తిని, నీ శరీరంలో ప్రవహిస్తున్న ఇక్ష్వాకుల రక్తాన్ని ప్రశ్నించి చూడు. అవేమంటాయో విను. కృత్రిమమైన మారణ ధూమంచే శత్రునాశనం చేయడం అధర్మమని అవి ఘోషిస్తాయ్, నాయనా."

"అధర్మానికి ఉదాహరణభూతులైన రాక్షసులను అధర్మ యుద్ధంతోనే ఎదుర్కోవచ్చునని నేను తలంచాను. శత్రువులు బహుళంగా ఉన్నప్పుడు కూటయుద్ధనీతి అధర్మం కాదని తలంచాను" అని నీలిని సమర్థించాడు లక్ష్మణుడు.

"శ్రీరామునికి ఇలాంటి దురవస్థ సంభవిస్తుందని కలలోకూడ నేను తలంచుకోలేకపోయానోయ్! శ్రీరాముని భుజబలాన్ని, అస్త్రపటుత్వాన్ని వాని సోదరుడే సందేహించవలసిన దుర్గతి సంభవించింది. తంత్రీ! పధ్నాలుగు వేలు కాదు — పధ్నాలుగు భువనాలు ఎత్తివచ్చినా భగవాన్ విశ్వామిత్ర శిష్యునికి దీటువస్తాయా? ఆలోచించి చూడు, లక్ష్మణా! సరే జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఈ జనస్థాన విజయం అమేయ ప్రతిభావంతురాలైన నిషాదస్త్రీ నీలిదిగానే ఉండనీ. నాకు దాంట్లో ఏమాత్రం అసూయ లేదు. ఇలాంటి స్థితిలోనూ నా కొకే తృప్తి, లక్ష్మణా! ఖరదూషణాదులు ధూమానికి లొంగిపోకముందే నా బాణానికి వచ్చారు. వారిని పరాక్రమ యుద్ధంతో జయించాలిగాను. నీలి మాత్రం మన ఆశ్రమం వదిలి వెళ్లిపోవలసిందే. నా నిర్ణయానికి మారు తిరుగులేదు."

• • •

మరునాడు ఉదయం ఉషస్సు నిర్గమించక ముందే లక్ష్మణుడు తన నిత్యవిధులను నెరవేర్చుకొనే నిమిత్తం మంచెమీంచి క్రిందికి దిగాడు. మంచె దగ్గరగా సింహద్వారం దగ్గర సీతాదేవి నిలబడి తూర్పు దిక్కుగా చూస్తున్నది. పాదాల సవ్వడి విని సీతాదేవి తిరిగి చూచింది. ఆమె ముఖాన్ని చూచి లక్ష్మణుడు చకితుడైపోయాడు. సీత, మిక్కుటంగా దుఃఖించినట్లు, ఏడ్చినట్లు ఆమె ముఖమే ఎత్తి చూపెట్టుతూంది. ఆమె బుగ్గలపై కన్నీటి చారలు కన్పించాయి. మిక్కుటంగా ఏడ్చినందున కాబోలు కనుబొమ్మలు వాచి ఎరుపెక్కాయి.

"మరిదీ! మన నీలి వెళ్లిపోయింది!......" అని చెప్పింది సీతాదేవి గద్గద కంఠంతో.

లక్ష్మణుడు దీర్ఘంగా నిట్టూర్చాడు.

• • •

సముద్రం భీకరంగా కెరటాలను తీరానికి దొర్లిస్తున్నది. ఆడకెరటాలు మగ కెరటాలతో ఎకసెక్కాలాడుతూ కొండెత్తుకు పొంగి హొందాగా ముందుకు వస్తున్నాయి. దగ్గరగా ఉన్న పర్వతశ్రేణులపై వానరబలం దీనంగా ముఖాలు వేలవేసుకొని సముద్రాన్నే చూస్తున్నాయి.

శ్రీరాముడు దర్భశయనంపైన పవళించి ఉన్నాడు. లక్ష్మణుడు చేతులు కట్టుకొని అన్నవైపు చూస్తూ నిల్చున్నాడు. సుగ్రీవుడు, అంగదునితోను, హనుమదాది మంత్రులతోను

శ్రీరాముని చరణసన్నిధానంలో సభ తీర్చాడు. ఎవరి నోటంటా ఏమాటా లేదు. అందరి మస్తిష్కాల్లోనూ "సముద్రానికి వారధి కట్టడమెలా?" అనే ప్రశ్న తిరుగాడుతూంది. ఆ ప్రశ్నకు సమాధానం ఎవరికీని దొరకడం లేదు.

"లక్ష్మణా! నా విల్లందుకో! బ్రహ్మాస్త్ర ప్రయోగం చేసి ఈ దుష్ట సముద్రాన్ని ఇంకిస్తాను!" అన్నాడు శ్రీరాముడు.

వానరబలంలో అలజడి చెలరేగింది. హనుమంతుడు పెద్ద నిట్టూర్పును బరువుగా విడిచాడు. సుగ్రీవునికి కలవరం హెచ్చింది. లక్ష్మణుడు కోదండాన్ని అన్నగారికి అందిచ్చాడు. శ్రీరాముడు, ఉపవాసకృశ శరీరం ఎఱ్ఱపడ వింటనారిని జోడించాడు.

సముద్రం పొంగింది. అలల మధ్యనుండి ఆర్తనాదం బయలుదేరింది. "భగవన్! శ్రీరామా! శరణు, శరణు. ఆడదానికోసం స్వార్థానికి లొంగి కోట్లకొలది జీవరాసులను చంపుతావా? అలల అలజడి లేకుండా నేను నిశ్చలంగా ఉంచాను. నాపై వంతెన నిర్మించుకోవచ్చు. శాంతిని వహించు, రామా, శాంతిని వహించు."

శ్రీరాముడు శాంతించాడు. వానరులు గంతులు వేశారు.

"హనుమా! సముద్రుడు సరైన నీతిని బోధించాడు. అదో చూడు. సముద్రం పెద్ద చెరువులాగు నిశ్చలంగా ఉంది. వంతెన కట్టండి. నీలుడున్నప్పుడు నేను మరలి వెళ్లిపోదానికే తీర్మానించాను. సీతానిమిత్తం కోట్లకొలది జీవరాసులను వధించడం అధర్మం!" అని గంభీరంగా చెప్పాడు రాముడు.

"ప్రభూ! నీలుడు వేసిన రాళ్ళు మునిగిపోవు. కాని, ఆ రాళ్ళు ఒకటికొకటి కలిసి ఉండవు. వాటిని అతికే విద్య వానికి తెలియదట!" అన్నాడు మారుతి తడబడుతూ.

తిరుగ పెద్ద సమస్య లేచింది!

"ప్రభూ! తమ దర్శనార్థం ఒక మూగది, విషాదమూర్తి వచ్చి ఉంది!" అని విన్నవించుకొన్నాడు యువరాజు అంగదుడు.

"కుమారా! ప్రవేశపెట్టు" అని ఆజ్ఞ ఇచ్చాడు, శ్రీరాముడు.

శ్రీరామ పాదాలను స్పృశించి కళ్లకద్దుకుంది నీలి. "నీలీ! నీలాగే శ్రీరాముడుకూడ అక్రమ నీతిని అవలంబించడానికి సిద్ధమయ్యాడు. కాని సమయానికి బుద్ధి వికసించింది. నిన్ను పూర్తిగా క్షమిస్తున్నాను. ఏం కావాలో కోరుకో" అని అన్నాడు ధర్మమూర్తి శ్రీరాముడు.

నీలి తనతో తెచ్చుకొన్న రాతిబల్లపై వ్రాసింది: "ప్రభూ! నేను సముద్రంలో రాళ్లని కదలనీయకుండా అతికి వంతెన కట్టగలను. ఈ సేవాభాగ్యాన్ని మీరు నాకు ప్రసాదించాలి — ఇదే నా కోరిక."

శ్రీరాముని ముఖం తామరపువ్వువలె వికసించింది. అందరు వానరులూ సంతోషం పట్టలేక కుప్పిగంతులు వేశారు. వానరులు రాళ్లను సముద్రంలో కుమ్మరిస్తున్నారు. నీలి అతి నేర్పుగా నీలుని సహాయంతో రాళ్లను జోడిస్తూంది. రాళ్లు అతుక్కొని పోతున్నాయి. వారధి బంధనం ఆరంభమయింది.

* * *

శ్రీ రామాయణ కథాభాగంలో అతి ముఖ్యమైన రావణసంహారం జరిగింది. సీతాదేవి విడుదల, అగ్నిపరీక్ష పూర్తి అయినవి. భక్తాగ్రేసరుడైన విభీషణుని పట్టాభిషేకం విధ్యుక్తంగా జరిగింది.

పుష్పక విమానంపై వానరముఖ్యులు, విభీషణుడు మొదలైనవారితో శ్రీరాముడు, స్వపత్నీ సోదర సహితుడై అయోధ్యకు పయనమయ్యాడు. నీలిదేవి, సీతాదేవి ప్రక్కనే ఆసీనయై ఉంది.

మునివేషంతో భరతుడు, వానప్రస్థాశ్రమ విధిని పాటిస్తున్న శత్రుఘ్నుడు, వసిష్ఠ మహర్షి, సుమంత్రాది అమాత్యవర్గం, పురప్రముఖులు అందరూ సరయూనదీ తటమందు సమ్రాట్ లాంఛనాలతో శ్రీరామచంద్రుని రాజట్టుకొన్నారు.

సంతోషంతో ఘీంకరిస్తున్న, స్వర్ణాభరణ భూషితమైన పట్టపుటేనుగుపై సీతారాములు కూర్చున్నారు. ఏనుగు అంబారీకి రత్నఖచిత స్వర్ణదండ విరాజితమైన శ్వేతచ్ఛత్రం గంభీరంగా రాణిస్తున్నది. స్వర్గ సుందరులవలె చూడముచ్చటగా ఉన్న ఇద్దరు కన్యకామణులు వింజామరలు ఇరువైపుల వీస్తున్నారు. పట్టపుటేనుగ ఠీవిగా కదిలింది. కాహళ శంఖధ్వనులు మిన్నుముట్టాయి. రాచనగరు సింహద్వారం వద్ద రాజమాతలు ముగ్గురున్నూ సీతారాములను అక్కున చేర్చుకొని ఆశీర్వదించి ఆనందబాష్పాలు రాల్చారు.

శ్రీరాముడు సరిగా సూర్యు డుదయిస్తున్నప్పుడే రాజప్రాసాదాన్ని ప్రవేశించాడు. వసంతాగమనంచే రాణించే నందనవనంవలె అయోధ్యానగరి సంపూర్ణ లక్ష్మీకళలతో శోభించింది. ఆ దినం ఇంటింటా పండుగ వేడుకలు చేసుకొన్నారు ప్రజలు. రెండు మాసాలకు ముందే దీర్ఘదర్శియైన వసిష్ఠముని అభిషేక సంభారాలను సేకరించి ఉంచుకొన్నాడు. మహామంత్రి సుమంత్రునికి శ్రీరామ పట్టాభిషేకం జరిపించడానికి అనుజ్ఞ ప్రసాదించారు, మహా పురోహితులు.

పట్టాభిషేక మహోత్సవం మహా వైభవంగా జరిగింపబడింది. భూరి దక్షిణలు, గోదానాలు విరివిగా జరిగాయి. అభిషేకానంతరం మహాసభ కూడింది. మంత్రి, దండనాథ ప్రముఖులతోను, సామంతరాజులతోను, పురప్రముఖులతోను సభ నిండుగాను, కోలాహలంగాను ఉంది. యుద్ధంలో తనకు సహాయం చేసినవారి కందరికిని తగు విధంగా సన్మానించుటకే ఆ సభను సమావేశపరిచాడు చక్రవర్తి శ్రీరామచంద్రుడు. సన్మానసభ పూర్తి బాధ్యత లక్ష్మణునిపై మోపబడింది.

భగవాన్ వసిష్ఠులవారి వేదఘోషతో సభ ప్రారంభమయింది. "'శ్రీ రామాయణ రత్నం' అని బిరుదు మారుతికి ప్రసాదింపబడింది!" అని సౌమిత్రి బిగ్గరగా సభలో ప్రకటించాడు. మారుతి ఆనందంతో ఎగిరి గంతువేసి శ్రీరామ పాదాలను పట్టుకొని నమస్కరించాడు.

జాబితాలో రెండవ పేరు శ్రీమతి నీలిదేవిది.

"జనస్థాన విజయపతాకా! సేతు బంధన కార్యనిర్వహణ భాగ్యశాలి! నీలిదేవి!" అని ఆహ్వానించాడు సౌమిత్రి.

సింహాసనంపైన శ్రీరాముని ప్రక్కన కూర్చున్న సమ్రాజ్ఞి సీతాదేవి మందహాసం చేసింది. సభలోని వారందరూ ఆతురతతో




నిరీక్షణ
చిత్రం—ఎస్. కృష్ణారావు (మద్రాసు)

నీలిదేవి దర్శనంకొరకు ఎదురు చూస్తున్నారు. నీలిదేవి సభలో లేదు! లక్ష్మణుడు నాలుగు ప్రక్కలా చూచాడు.

తన ఆసనంనుంచి వసిష్ఠ మహాముని లేచి ఇలాగన్నారు: "నీలిదేవి ఏదో కార్యాంతరంచే సభలో హాజరు కాలేకపోయిందనుకుంటాను. ఆమెకు చెందవలసిన బహుమతిని ఉద్ఘాటించి మీది కార్యక్రమాన్ని కొనసాగించడం ఉచితంగా ఉంటుంది."

"నీలిదేవి చేసిన సేవ చాలా గొప్పది. ఆ సేవని అంగీకరిస్తూ సమ్రాట్ శ్రీరామచంద్ర ప్రభువు ఆమెకి ఖరపాలితమైన జనస్థాన రాజ్యాధిపత్యాన్ని సంపూర్ణ హక్కులతో ప్రసాదించారు. మాండలిక ప్రభ్వి నీలిమహారాణి ఇకమీదట అయోధ్యా



వర్షాగమనం　　చిత్రం—పి. నాగేశ్వరరావు (రావెం)

నగర సామ్రాజ్యానికి ప్రధాన మాండలిక రాణిగా వ్యవహరింపబడుతుంది!" అని ఉద్ఘాటించాడు లక్ష్మణుడు.

తరువాత జరుగవలసిన సన్మాన ప్రకటనలు యథావిధిగా జరిగాయి. ఆనందతరంగాలతో నళ, క్షీరసముద్రంలాగు పొంగి పొరలింది.

• • •

సౌమిత్రి రాజోచితాలంకరణతో, నవమన్మథునివలె తయారై తన ప్రణయ సఖిని, ఊర్మిళను చూచి సంభావించాలని ఉవ్విళ్లూరుతూ తన నగరు 'లక్షణావతి' కి బయలుదేరాడు. ఏమాశ్చర్యం! నగరు తాళాలు వేయబడి ఉంది. ఒక సాయుధపాణియైన కావలాదారు పచారు చేస్తున్నాడు సింహద్వారం ముందర. కుతూహలంతోను, ప్రేయురాలి దర్శనలాభ కాంక్షతోను బరువెక్కిన హృదయంతోకూడిన లక్ష్మణునికి గొప్ప ఆశాభంగమయింది. ద్వారపాలకుడు సైనికాభివాదనం చేశాడు.

"దారుకా! నగరు తాళాలు వేసి ఉండడానికి కారణమేమి?" ప్రశ్నించాడు సౌమిత్రి.

ద్వారపాలకుడు రాజశాసనాన్ని చూపించాడు. "సరే! వెళ్లి వసుంధరాదేవిని పిలుచుకొనిరా."

ద్వారపాలకుడు పరుగుతో నిష్క్రమించాడు. కొన్ని నిమిషాల్లో చేటీ జనాధ్యక్షురాలు వసుంధర వచ్చింది. మౌనంగా తలుపులు తీసింది. తాను ఓరగా నిలబడి తల వంచుకొంది.

"ఊర్మిళాదేవి ఎంతకాలంనుండి యోగనిద్రలో ఉన్నారు?" అని ప్రశ్న వేశాడు సౌమిత్రి.

వసుంధర నిలువెల్లా కంపించింది. ఆమె సుమిత్రాదేవితో ఈ విషయంగా సంప్రతించే

# జనస్థానం

వచ్చింది. "మనమేం చేయగలం, వసుంధరా? కుమారుడు వచ్చినప్పుడు లోపలికి ప్రవేశపెట్టు. ఆ తరువాత ఏంజరిగితే అదే జరుగనీ!" అని సుమిత్రాదేవి సలహా చెప్పింది.

ధైర్యం కూడతీసుకొని వసుంధర ఇలా చెప్పింది: "ప్రభూ! మీరందరు అరణ్యానికి వెళ్లిన రెండు మాసాలైన తరువాత యువరాణి యోగనిద్రలో ప్రవేశించారు."

"సరే ! శయనాగారానికి దారిని చూపెట్టు."

"ఇలా రండి ప్రభూ !" అంటూ దారి తీసింది వసుంధర.

హంసతూలికాతల్పంమీద మెరుగు దిద్దబడిన నల్ల సానరాతి విగ్రహంవలె పవళించి ఉంది ఒక వనిత.

"ఓహో!" అనే శబ్దం వసుంధర నోటంట వెడలింది.

ఆమె చెమటచే తడిసిపోయింది. నోటంట మాట రాలేదు.

"సీత! ఇది అసంభవం. సీత ఇక్కడికి ఎలా వచ్చింది?"

"క్షంతవ్యురాల్ని! నాకేం తెలియడం లేదు. ఈమె ఎవరో నాకు తెలియదు ప్రభూ!"

"వసుంధరా! నీవు ఏదో అసత్యం చెబుతున్నట్లే తలుస్తాను. సరే! వెళ్లి మా అన్నగారికి ఈ వృత్తాంతాన్ని చెప్పు. ఇదిగో రాజముద్ర. ఇది నీకు చక్రవర్తి సన్నిధానానికి ప్రవేశం ఇవ్వగలదు" అని సౌమిత్రి వసుంధరకు రాజముద్రను ఇచ్చాడు.

వసుంధర బ్రతుకు జీవుడా అని శ్వసించి నిష్క్రమించింది.

• • •

సీతారాము లిద్దరూ రథారూఢులై లక్షణావతికి వచ్చారు. ఇద్దరూ, వసుంధర దారి చూపుతుండగా శయనాగారాన్ని చేరుకొన్నారు.

"అన్నా! చూడండి. ఊర్మిళ పర్యంకంలో సీత పడుకొని ఉంది" అన్నాడు దీనంగా లక్ష్మణుడు.

"మరిదీ! నీవేం కంగారు పడవద్దు. మన సీత మనలను మోసపుచ్చింది. సీతే మన ఊర్మిళ! ఊర్మిళే మన సీత! నీవుగాని, ప్రభువులు కాని పోల్చుకోలేకపోయారు. నేను కొంతకాలానికి పోల్చుకొన్నాను. నా చెల్లెలు నా పాదాలపైబడి క్షమాభిక్ష వేడింది. రహస్యాన్ని చెప్పవద్దని బ్రతిమాలుకొంది. నేనూ సందర్భాలను బాగా ఆలోచించి సీత రహస్యాన్ని కాపాడాను."

లక్ష్మణుడు ఆశ్చర్యంతోను, సిగ్గుతోను క్రుంగిపోయాడు. రాముడు తమ్ముని భుజంపై చేయి వేసి, నవ్వుతూ ఇలాగన్నాడు: "సౌమిత్రీ! ఊర్మిళ శ్లాఘనీయమైన ప్రతిభ కలది. ఆమే లేకుంటే మనం సముద్రాన్ని దాటడం సాధ్యం కాని పని. కాబట్టి ఊర్మిళ రహస్యచర్య విధిప్రేరితమే. ఈ రహస్యం వసుంధరకు, మనకు తప్ప ఎవరికినీ తెలియ నవసరంలేదు. ఊర్మిళ నిద్రపోనీ. ఆమె లేచిన తర్వాత నీవు ఆమెని ఏమీ ఎరగనట్లే సంధించి సంభావించు. మనం పోదాం పద. వసుంధర లక్షణావతిని కాపాడుకొంటుంది!" అన్నాడు మహాత్ముడు శ్రీరాముడు.

వసుంధర తప్ప అందరూ నిష్క్రమించారు. ఊర్మిళ గాఢంగా నిద్రపోతున్నది. ★